సాక్షి మంచిర్యాల

బుధవారం। 31। జనవరి। 2024



ఆర్పీల వేతన వెతలు..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్పీలకు ఏడు నెలలుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాల్టీల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరి పాత్ర కీలకం. 8లో▸



ఘనంగా గాంధీ వర్ధంతి

స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ వర్ధంతిని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఎన్‌ఎస్‌ఎస్ సమావేశం

మంచిర్యాలఅర్బన్: జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రోగ్రాం అధికారుల సమావేశం ఈ నెల 31న మంచిర్యాలలో నిర్వహించనున్నట్లు మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఉదారి చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. మేడారం జాతరలో పాల్గొనే వాలంటీరీలు, ప్రోగ్రామ్ అధికారులపై చర్చిస్తామని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం కో–ఆర్డినేటర్ ఈసం నారాయణ హాజరు కానున్నారని, 2022–23 సంవత్సరానికి రెగ్యులర్ కార్యక్రమాల నివేదికలతో ప్రోగ్రామ్ అధికారులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ధర్నా



చెన్నూర్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

చెన్నూర్: పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. సీసీఐ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం వరకు పత్తి వాహనాలకు టోకెన్లు ఇచ్చి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. మార్కెట్ యార్డులో ఉన్న వాహనాలకు టోకెన్లు ఇవ్వాలని రైతులు సీసీఐ, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీసీఐ సీపీవో ఉదయ్‌షా, కార్యదర్శి రామాంజనేయులు రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో ఉన్న పత్తి వాహనాలకు టోకెన్లు ఇస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. బుధవారం సైతం ఎన్ని పత్తి వాహనాలు వచ్చినా టోకెన్లు ఇస్తామని పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ మంచిర్యాల యూనిట్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన టీఎన్జీవోస్ మంచిర్యాల యూనిట్

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ మంచిర్యాల యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికలు మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించారు. అధ్యక్ష పదవికి నాగుల గోపాల్, ఎస్.మల్లేశ్, జాయింట్ సెక్రెటరీగా బి.అరుణ, మీసాల వరమ్మ, కోశాధికారిగా ఎన్.సతీశ్‌కుమార్, ఐ.శ్రావణ్‌కుమార్, ఈసీ మెంబర్–1గా కె.ప్రవీణ్, సీహెచ్.వెంకటేశ్వర్, ఈసీ మెంబర్ 2గా వి.ప్రసన్న, ఏ.దిలేష్ పోటీ పడ్డారు. మిగతా వారికి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పొన్న మల్లయ్య తెలిపారు. బరిలో నిలిచిన వారికి ఎన్నికలు నిర్వహించగా సభ్యులు ఓటు వేశారు. యూనిట్ అధ్యక్షుడిగా నాగుల గోపాల్, ఉపాధ్యక్షుడిగా బి.ప్రకాశ్, కార్యదర్శిగా టి.అజయ్ ప్రశాంత్, సంయుక్త కార్యదర్శిగా బి.అరుణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పి.సందీప్, కోశాధికారిగా ఎన్.సతీశ్‌కుమార్, పబ్లిసిటీ సెక్రెటరీగా ఎంఏ హఫీజ్, ఈసీ మెంబర్లుగా కె.ప్రవీణ్‌కుమార్, వి.ప్రసన్న ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి రామ్మోహన్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీపతి బాపురావు, సంయుక్త కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల కొనుగోలుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో పాఠ్యపుస్తకాల కొనుగోలుకు అధీకృత డీలర్లు/వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త బాలభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరావత్ రుసుం రూ.50 వేలు(ఎస్సీ/ఎస్టీ వారికి 40 శాతం రాయితీ)గా నిర్ణయించామని, ఆసక్తి గలవారు రూ.వెయ్యి ప్రిన్సిపాల్, డీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్/జేసీ(బాలురు), జైపూర్ పేరిట డీడీ రూపంలో శాఖ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు ఫారం పొందిన తర్వాత ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 7వరకు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్/జేసీ(బాలురు), జైపూ ర్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో పనివేళల్లో ఫారం పొందవచ్చని తెలిపారు. వచ్చే నెల 8న సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని, ఈ నెల 9న ఉదయం 11 గంటలకు జిల్లాలోని నస్పూరు సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

గులాబీ గూటిలో అసమ్మతి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌పై అసంతృప్తి
- స్థానికులకే జిల్లా బాధ్యతలు ఇవ్వాలని డిమాండ్లు
- సిట్టింగ్ ఎంపీ తీరు పైనా కేడర్‌లో తీవ్ర వ్యతిరేకత
- 'బెల్లంపల్లి' సమావేశంలో బహిర్గతం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌పై పార్టీలో అసమ్మతి బయటపడుతోంది. సరిగ్గా రెండేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాల వారీగా అధ్యక్షులను ప్రకటించగా.. జిల్లాకు నాటి చెన్నూర్ ఎమ్మెల్యేగా ఉన్న బాల్క సుమన్‌కు పార్టీ అధినేత కేసీఆర్ అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. పార్టీ పగ్గాలు చేతిలో ఉన్నప్పుడు శ్రేణులను ఏకం చేయడం, గ్రూపు తగాదాలను తగ్గించడంతోపాటు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి దాకా స్థానికంగా ఉండరనే అపవాదు మోస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా పార్టీ నాయకులకు అందుబాటులో ఉండడం లేదని, హైదరాబాద్‌కు పరిమితం అవుతున్నారని ప్రతిపక్షాలు తరచూ విమర్శించేవి. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆయన తీరుపై సొంత పార్టీలోనే వ్యతిరేకత వచ్చినట్లుగా చెబుతారు. తాజాగా ఆయనను పక్కకు పెట్టి స్థానికులకే పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలనే డిమాండ్లు మొదలయ్యాయి. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ బెల్లంపల్లి నియోజకవర్గ పార్టీ సమావేశంలో అందరికీ అందుబాటులో ఉండే స్థానిక నాయకులకే ఇవ్వాలని కోరడం సుమన్‌పై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తోంది.

ఘోర ఓటమి తర్వాత..

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఘోర పరాజయాన్ని చవిచూశారు. ఫలితాల తర్వాత కోలుకుని ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుంటూ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండాలి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఇటువైపు చూడకపోవడంతో ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్న వారిలో చాలామంది ఎవరి దారి వాళ్లు చూసుకుంటున్నారు. ఇటీవల జరిగిన సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ జిల్లా అధ్యక్షుడు పాల్గొనలేదు. దీంతో కార్మిక నాయకులు పార్టీని వీడారు. ఇక జిల్లాలోని మున్సిపాల్టీల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు చైర్మన్లను అవిశ్వాసంతో గద్దె దింపి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్నారు. అనేకమంది కౌన్సిలర్లు, చైర్మన్లు, వైస్‌చైర్మన్లతోపాటు పలు విభాగాల నాయకులు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. తమకు అండగా లేకపోవడం, ఇదే తీరుగా పార్టీ కొనసాగితే తమ రాజకీయ భవిష్యత్ దెబ్బతింటుందనే భావనతో చాలామంది పార్టీని దూరం పెడుతున్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో జెండా మోసిన కార్యకర్తల్లో మనోధైర్యం నింపి మళ్లీ పార్టీకి పునర్జీవం పోయాల్సిన స్థానంలో ఉండి కూడా పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెప్పుకుంటున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ కష్టమేనా?

మరో రెండు నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నాటికి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయాలి. లేకపోతే అటు ప్రజల్లో ఇటు పార్టీ కేడర్‌లోనూ నమ్మకం కోల్పోతే మరింత కష్టంగా మారే పరిస్థితి ఉంది. మరోవైపు సిట్టింగ్ ఎంపీగా పదవీలో ఉన్న వెంకటేశ్ నేత సైతం జిల్లా వైపు చూడకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకానున్నాయి. అసెంబ్లీ ఫలితాల తర్వాత పార్టీ పరంగా మాజీ ఎమ్మెల్యేలు కార్యక్రమాలు చేపడితే జిల్లా అధ్యక్షుడితోపాటు ఎంపీ సైతం హాజరు కావడం లేదు. దీంతో సిట్టింగ్ ఎంపీ పార్టీ మారుతారమోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశానికి జిల్లా అధ్యక్షుడితోపాటు ఎంపీ సైతం రాలేదు. దీంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ బలంగా ఉండడంతో బీఆర్‌ఎస్ పరిస్థితి కష్టమే అని కేడర్‌లోనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో దెబ్బతిన్న 'గులాబీ' పార్టీ వచ్చే ఎన్నికలను ఎలా ఎదుర్కొంటుందనేది వేచి చూడాలి.

పంచాయతీ 'ప్రత్యేక'ం

- రేపటితో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం
- ప్రత్యేక అధికారుల జాబితా రెడీ



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీ కాలానికి రేపటితో తెరపడనుంది. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులు, వార్డుసభ్యులు 2019 ఫిబ్రవరి 2న బాధ్యతలు చేపట్టగా 2024 ఫిబ్రవరి 1వ తేదీతో పదవీకాలం ముగియనుంది. అప్పులు చేసి మరీ చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని, మరో ఆరు నెలలు తమ పదవీకాలం పొడగించాలని సర్పంచులు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రత్యేకాధికారుల పాలన ఉండడంతో ప్రభుత్వం అటువైపే మొగ్గు చూపుతూ రంగం సిద్ధం చేసింది. ఆయా శాఖల వారీగా అధికారులను గుర్తించింది.

ప్రత్యేక అధికారుల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 311 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకానికి పంచాయతీ రాజ్ శాఖ కసరత్తు పూర్తి చేసింది. ఇందులో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓ(మండల పంచాయతీ అధికారి)లు, పంచాయతీరాజ్ ఏఈలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ(ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు. అటవీ శాఖ అధికారుల వివరాలూ సేకరించి నివేదిక సిద్ధం చేశారు. వీరితోపాటు ఎంఈఓలు, పశు వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్లు, ఉద్యానవన శాఖ అధికారులు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్లను నియమించేలా జాబితా సిద్ధం చేశారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలను గ్రామ పంచాయతీల జనాభాకు అనుగుణంగా నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు గెజిటెడ్, చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను సర్దుబాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, నూతన నిర్మాణాలను అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, పన్నుల వసూళ్లు తదితర కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాల్సి ఉంటుంది.

ప్రగతికి ఆటంకం..

ప్రత్యేక అధికారుల పాలనలో పల్లె ప్రగతికి ఆటంకం కలుగుతుందని ప్రస్తుత పాలకవర్గాలు పేర్కొంటున్నాయి. పారిశుధ్య పనులు, వీధిదీపాల ఏర్పాటు, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా వంటి పనుల్లో అంతంత మాత్రంగా ఉంటే సమస్యలు తప్పవని అంటున్నారు. సొంత డబ్బులతో ఇన్నాళ్లు పనులు చేసి బిల్లుల కోసం చూస్తున్న తరుణంలో ప్రత్యేక పాలనలో నిబంధనల మేర పని చేస్తే ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక అధికారుల నియామకానికి జాబితా సిద్ధం చేశామని డీపీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలి..



ఫిబ్రవరి 1న మా పదవీ కాలం పూర్తికానుంది. కోవిడ్ ప్రభావంతో దాదాపు రెండేళ్ల పదవీ కాలం వృథాగానే గడిచిపోయింది. అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేపట్టాం. చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి. సర్పంచులుగా బిల్లుల కోసం ఎంతో ఆరాటపడుతున్నాం. ఈ ప్రభుత్వం మా గోడును ఆలకించి బిల్లులు ఇచ్చి సమస్యల నుంచి గట్టెక్కించాలి.

– వోలపు శారద, సర్పంచ్, వేంపల్లి

ఇంద్రవెల్లి.. సెంటిమెంట్

- మరోసారి ఈ గడ్డ నుంచే సమర శంఖం..
- లోక్‌సభ ఎన్నికల నగారా మోగించనున్న రేవంత్
- నాటి సభా స్థలమే.. మళ్లీ వేదిక
- అమరవీరుల కుటుంబ సభ్యులతో భేటీ
- విజయవంతం చేయాలని హైదరాబాద్‌లో సీఎం పిలుపు



2021 ఆగస్టులో జరిగిన ఇంద్రవెల్లి సభలో కాలికోం వాయిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి గడ్డను సెంటిమెంట్‌గా తీసుకున్నారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకం తర్వాత 2021 ఆగస్టు 9న ఇక్కడే మొదటి సభ నిర్వహించారు. నాడు 'దళిత, గిరిజన దండోరా' పేరిట నిర్వహించిన సభకు లక్షకు పైగా జనం విచ్చేశారు. సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో రేవంత్ రెడ్డి ఇక వెనుదిరిగి చూడలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో పలు సభలు నిర్వహించారు. అప్పటినుంచే కాంగ్రెస్‌పై ప్రజల్లో మక్కువ పెరిగిందన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమైంది. దానికి తగ్గట్టుగానే ఎన్నికల్లో హస్తం పార్టీ విజయం సాధించడం, రేవంత్‌రెడ్డి సీఎం కావడం జరిగిపోయాయి. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నగారాను కూడా ఇంద్రవెల్లి గడ్డ మీదనుంచే మొదలుపెట్టాలని రేవంత్ రెడ్డి నిర్ణయించారు. సీఎం టూర్ ఇదివరకే నిర్ణయం కాగా తేదీ ఖరారు కాలేదు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఫిబ్రవరి 2న తన పర్యటన ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈమేరకు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సవాలే..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, శాసనసభ ఎన్నికల్లో నాలుగు బీజేపీ, రెండు బీఆర్‌ఎస్ గెలువగా, ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచే సవాల్‌గా తీసుకొని సెంటిమెంట్‌ను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ రసవత్తరంగా మారనుంది. మొత్తంగా ప్రతికూల పరిస్థితుల నుంచి అనుకూల ఫలితం సాధించే దిశగా పార్లమెంట్ ఎన్నికలకు ఈ గడ్డ మీద నుంచి సమరశంఖం పూరించనున్నారు.

నేడు ఇంద్రవెల్లికి మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: సీఎం ఇంద్రవెల్లి పర్యటన ఖరారైన నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బుధవారం ఇంద్రవెల్లికి రానున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నేతలతో మంగళవారం సమీక్ష జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. నేడు ఉదయం 11 గంటలకు మంత్రి సీతక్క అమరవీరుల స్తూపానికి వచ్చి ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

అదే వేదిక..

నాటి సభను ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సమీపంలో నిర్వహించగా.. తాజాగా ఫిబ్రవరి 2న సభను కూడా అదే స్థలంలో చేపట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు సాగుతున్నాయి. తద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇంద్రవెల్లి గడ్డను సెంటిమెంట్‌గా తీసుకొని ముందుకు కదులుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఆ రోజు మొదట కేస్లాపూర్‌కు సీఎం రానున్నారు. నాగోబాకు పూజల అనంతరం పక్కనే ఉన్న గిరిజన దర్బార్ సభ వేదికలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతి నిధులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంటారు. అక్కడ నివాళుల ర్పించిన అనంతరం సభలో పాల్గొననున్నారు. 1981 ఏప్రిల్ 20న జల్ జంగల్ జమీన్ కోసం జరిగిన పోరాటంలో పోలీసు కాల్పుల్లో అమరులైన వారి కుటుంబ సభ్యులతో సీఎం భేటీ కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులు సీఎం పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ముందుకు కదులుతున్నారు. మరో వైపు సీఎం జిల్లాకు రానున్న నేపథ్యంలో అధికారిక ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలిస్తున్నారు. బందోబస్తు విషయంలో ఎస్పీ నిశితంగా పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నా యి.

సింగరేణిని పెట్టుబడిదారుకు అప్పగించే కుట్ర

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ విఠల్, మాజీ ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి: సింగరేణి కంపెనీని బడా పెట్టుబడిదారుడు అదానీకి అప్పగించే కుట్ర జరుగుతోందని, తస్మాత్ జాగ్రత్త అని రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక పద్మశాలి భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతో సమావేశమైన మూడు రోజులకే విదేశీ పర్యటనలో అదానీతో భేటీ అయ్యారని, రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతానని ప్రకటించడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అదానీకి ఆస్ట్రేలియాలో ఉన్న బొగ్గు గనులు నష్టాల్లో కూరుకుపోవడంతో సింగరేణి సంస్థను అప్పగించేందుకు సీఎం కేంద్రం వద్ద మోకరిల్లారని విమర్శించారు. తనపై తన గురువుపై ఉన్న కేసులు రద్దు చేసుకోవడానికి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికి సిద్ధపడ్డారని ధ్వజమెత్తారు. సింగరేణిపై కుట్రలను అర్థం చేసుకుని కార్మికులు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ, కార్మికులను బీఆర్‌ఎస్ కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. సీఎం ఆర్భాటంగా ప్రారంభించిన ప్రజాదర్బార్ విఫలమైందని, అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే రూ.14వేల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రకటించిన కొన్ని పథకాలే ఎన్నికల్లో ఓటమికి కారణమని, రాష్ట్రాన్ని అభివృద్ధి పర్చే క్రమంలో పార్టీని, కార్యకర్తలను పట్టించుకోలేదనే వాస్తవాన్ని అంగీకరిస్తున్నామని తెలిపారు. ఇకపై ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని అన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా యువకులకు క్రీడాపోటీలు నిర్వహిస్తానని ప్రకటించారు. త్వరలోనే పార్టీ సంస్థాగత ఎన్నికలకు అధిష్టానం సిద్ధమవుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా స్థానికుడికే అవకాశం కల్పించాలని, స్థానికంగా నివాసం ఉండని వారికి అధ్యక్ష పదవి కట్టబెట్టడం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ శ్రేణుల జోలికి వస్తే తొక్కి పడేస్తామని హెచ్చరించారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణంగా తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్.దివాకర్‌రావు, బోడ జనార్దన్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్, నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి డైరెక్టర్లు
- పది మంది హాజరు



విజయ కేతనం చూపుతున్న డైరెక్టర్లు

జన్నారం: మండలంలోని పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌పై డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ నెల 8న పది మంది డైరెక్టర్లు హైదరాబాద్‌లోని కోఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్‌కు అవిశ్వాసాన్ని ప్రతిపాదించగా బలనిరూపణకు నోటీసులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఉదయం 11.30గంటలకు సమావేశం ఏర్పాటు చేయగా 13మంది డైరెక్టర్లకు గాను 10 మంది హాజరయ్యారు. మూడు రోజుల క్రితం క్యాంపునకు వెళ్లిన డైరెక్టర్లు నేరుగా కార్యాలయానికి చేరుకున్నారు. వీరిలో చైర్మన్ పదవి ఆశిస్తున్న అల్లం రవి మరో తొమ్మిది మంది డైరెక్టర్లు ఉన్నారు. అధికారులు నిర్వహించిన సమావేశంలో పది మంది సభ్యులు చైర్మన్ శీలం రమేశ్‌కు వ్యతిరేకంగా చేతులెత్తి అవిశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా, సమావేశానికి చైర్మన్ శీలం రమేశ్ గైర్హాజరయ్యారు.

చైర్మన్‌గా అల్లం రవి?

చైర్మన్‌గా అల్లం రవి ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. అవిశ్వాసం తీర్మానం ప్రతిపాదన నుంచి డైరెక్టర్లను ఏకం చేయడం, క్యాంపునకు తీసుకెళ్లడం ముందుండి నడిపించారు. దీంతో ఒప్పందం ప్రకారమే రవిని చైర్మన్ చేయడానికి డైరెక్టర్లు అంగీకరించినట్లు తెలిసింది.

కాంగ్రెస్ ఖాతాలోకి..

చైర్మన్ గిరి కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడనుంది. గత చైర్మన్ శీలం రమేశ్, డైరెక్టర్లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా ఆ పార్టీకి చెందిన వారే ఉండడంతో కొందరు డైరెక్టర్లు అటువైపు మొగ్గు చూపుతున్నారు. చైర్మన్ ఎన్నిక అనంతరం చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది. మంగళవారం కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు పీఏసీఎస్ కార్యాలయానికి రావడం గమనార్హం. కాగా, శ్రీరాంపూర్ సీఐ ప్రవీణ్‌కుమార్, జన్నారం ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు చైర్మన్ ఎన్నిక

అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ప్రస్తుత వైస్ చైర్మన్‌మహిపాల్‌రెడ్డి తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం 9 గంటలకు చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామని, డైరెక్టర్లకు సమాచారం అందించామని డీసీవో నర్సయ్య తెలిపారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


జగదీష్(ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాలగురిజాలకు చెందిన జాడి జగదీష్ (27) నాలుగేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. అతని తండ్రి మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తల్లి శాంత కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. జగదీష్ పలుమార్లు ఆత్మహత్యకు యత్నించగా వద్దని తల్లి వారించింది. సోమవారం రాత్రి ఇంటి వెనుకాల ఉన్న చెట్టుకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుని తల్లి శాంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: పట్టణంలోని బాబు క్యాంపుబస్తీలో జరిగిన ట్రాక్టర్ యజమాని గాజవేని సంపత్ అలియాస్ శ్రీధర్ (40) హత్య కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. మంగళవారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీకి చెందిన గాజవేని సంపత్‌పై రాంనగర్ బస్తీకి చెందిన ఖాజా మోహినుద్దీన్ ఈనెల 29న సెంట్రింగ్‌కు సపోర్టుగా వినియోగించే కర్రతో దాడిచేయడంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పారిపోయిన నిందితుడిని 24 గంటల వ్యవధిలోనే అరెస్టు చేసిన ఎస్సై రమేశ్, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుళ్లను ఎస్‌హెచ్‌వో అభినందించారు. సమావేశంలో కానిస్టేబుళ్లు మురళి, రవికుమార్, సుద్దాల రవికుమార్ పాల్గొన్నారు.

మట్కా ఆడుతున్న ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలో మట్కా ఆడుతున్న ఒకరిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం గాంధీచౌక్ వద్ద తనిఖీలు చేపట్టగా అర్జున్ వద్ద మట్కాకు సంబంధించిన చిట్టీలు, రూ.700 నగదు లభ్యమైనట్లు వారు పేర్కొన్నారు. చిట్టీలు, నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మధు, రమేశ్ పాల్గొన్నారు.

ఆర్పీల వేతన వెతలు..


మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు (ఫైల్)

- ఏడు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మెప్మా రిసోర్స్ పర్సన్‌లు

మంచిర్యాలటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లకు ఏడు నెలలుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పట్టణాల్లో ఉండే మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా వారికి బ్యాంకు రుణాలు ఇప్పించడం, స్వయం ఉపాధి పొందేందుకు పూర్తి సహకారం అందించడం, మున్సిపాలిటీల పరిధిలో చేపట్టే ప్రతీ ప్రభుత్వ కార్యక్రమాలలో ఆర్పీలదే కీలక భాగస్వామ్యం. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపట్టే పనులను సైతం ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లతో పాటు, ఆర్పీలు చేపడుతున్నారు. ఏ సర్వే చేయాలన్నా ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా, ఏ ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నా అన్నింటిలోనూ ఆర్పీలదే కీలక పాత్ర. ప్రభుత్వంలోని అన్ని శాఖలకు వీరి సేవలు అవసరం ఉంటోంది. ఏ పని చేయాలన్నా ఆర్పీలనే ఆయా ప్రభుత్వ శాఖలు వినియోగిస్తుండడం, ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలోనూ ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ సైతం పూర్తిగా వీరితోనే నిర్వహించారు. అయితే వీరికి ప్రభుత్వం నుంచి అందించే వేతనాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. అసలే తక్కువ వేతనాలు.. ఆపై ప్రతి నెలా అందించడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల ఆర్పీలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన వేతనాలేవి?

మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు 2018 లోనే ప్రభుత్వం రూ.4 వేల గౌరవ వేతనం అమలు చేసింది. ఆ తరువాత 2023 అక్టోబర్ 26న జీవో 756 ద్వారా మరో రూ.2 వేలు పెంచి రూ.6 వేల వేతనం ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలలకు సంబంధించిన రూ.4 వేల వేతనాలు, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన రూ. 6 వేల చొప్పున వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే డిసెంబర్ వరకు మొత్తం ఏడు నెలల వేతనాలు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఏడు నెలలుగా ఆర్పీలు వేతనాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇటీవల రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోని ఆయా మున్సిపల్ కమిషనర్లకు, ఈ నెల 29న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. పెండింగ్ వేతనాలను ఇవ్వడంతో పాటు కుటుంబ పోషణకు నెలకు రూ.20 వేల వేతనం, వీరికి అందించే వేతనాలను వీఎల్ఆర్, స్త్రీనిధి నిధుల నుంచి కాకుండా ప్రభుత్వ పరంగానే బడ్జెట్ కేటాయించాలని, డ్రెస్‌కోడ్ అమలు చేయాలని, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల ప్రమాద బీమా, జాబ్ చార్ట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీల వివరాలు

మంచిర్యాల	59
బెల్లంపల్లి	34
మందమర్రి	52
నస్పూర్	40
క్యాతన్‌పల్లి	22
చెన్నూర్	18
లక్సెట్టిపేట్	16

వేతనాలు ఇవ్వాలి



మున్సిపాలిటీ పరిధిలో మహిళా సంఘాలు ఏర్పాటు చేయిస్తున్నాం. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం. అలాంటి మాకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు వేతనం పెంచినా ఏడు నెలలుగా ఇవ్వడం లేదు. – పర్వతి మంగ, ఆర్పీ, మంచిర్యాల

ఆర్థికంగా ఇబ్బందులు..



మహిళా సంఘాలు 25 ఉంటే వాటికి ఆర్పీలుగా పనిచేస్తుంటాం. దీంతో పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖల సూచనల ప్రకారం విధులు నిర్వహిస్తున్నాం. ఇచ్చేది తక్కువ వేతనమే అయినా నెలల తరబడి ఆలస్యంగా ఇవ్వడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – పల్లెర్ల జ్యోతి, ఆర్పీ, మంచిర్యాల

ప్రతినెలా చెల్లించాలి



ప్రతీరోజు ఆయా మహిళా సంఘాలకు సంబంధించిన కార్యక్రమాలను ముందుండి నడిపిస్తుంటాం. ఇందుకు ప్రభుత్వం అందించే గౌరవ వేతనంపైనే ఆధారపడి పనిచేస్తున్నాం. వేతనాలు పెండింగ్‌లో ఉంచడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. – నజ్రీన్, ఆర్పీ, మంచిర్యాల

అన్నిరకాల విధులు



మహిళా సమాఖ్యలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, సకాలంలో చెల్లించేలా చూడడం, చిరు వ్యాపారాలు చేసుకునే వారికి సహకారం అందించడంతో పాటు ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల సర్వేలు, ఇతరత్రా అన్నిరకాల విధులు నిర్వహిస్తున్నాం. ఇలాంటి మాకు ప్రతినెలా వేతనాలు ఇచ్చేలా చూడాలి. – కాసిపాక లక్ష్మి, ఆర్పీ, మంచిర్యాల

కార్మికులందరికీ అండగా ఉంటాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): యూనియన్లతో సంబంధం లేకుండా కార్మికులందరికీ అండగా ఉండి వారి సమస్యలపై పోరాడుతామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో ఏఐటీయూసీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారామయ్య మాట్లాడుతూ ఏరియాలో ఏఐటీయూసీ గెలుపు కోసం కైరిగూడ కార్మికులు ఎంతో కృషి చేశారన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామన్నారు. ఒక యూనియన్ మరో యూనియన్‌కు ఏనాడు శత్రువు కాదని మన పోరాటం యాజమాన్యంతోనేనన్నారు. కార్మికులు ఐకమత్యంతో ఉండి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గోలేటి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, కైరిగూడ ఉపాధ్యక్షుడు రహీమాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, కిరణ్‌బాబు, రాజేశ్, చంద్రశేఖర్, దివాకర్, ఆనంద్, పిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, రామయ్య, అశోక్, రమేశ్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత



ఆస్పత్రిలో లేని మాత్రలపై టిక్ చేసిన దృశ్యం

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ప్రభుత్వాలు పేర్కొంటున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అడుగడుగునా సమస్యలే తాండవిస్తున్నాయి. వాంకిడి మండల కేంద్రంలోని ఉన్నత శేణి ప్రభుత్వ ఆస్పత్రిలో జలుబు, దగ్గు వంటి సాధారణ రోగాలకు సంబంధించిన మందులు అందుబాటులో లేవు. ఆస్పత్రికి వెళ్లిన రోగులను పరీక్షించిన వైద్యులు మందులు రాసి ఇస్తున్నారు. కానీ అన్నిరకాల మందులు ఆస్పత్రిలో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. సోమవారం ఓ వ్యక్తి దగ్గు, జలుబుతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా వైద్యుడు పరీక్షించి చీటీపై మూడు రకాల మందులు రాసి ఇచ్చాడు. ఆ వ్యక్తి చీటీ తీసుకుని మందులు ఇచ్చే కౌంటర్ వద్దకు వెళ్లగా ఒక రకమైన మాత్ర మాత్రమే ఇచ్చి మిగిలినవి బయట కొనుక్కోమ్మని సలహా ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి ఈ ఒక్క మాత్ర తీసుకుని ఏం చేయాలని, అదికూడా అక్కడే తిరిగి ఇచ్చేశాడు. బయటకు వచ్చి ప్రైవేటు మెడికల్ షాపులో రూ.100 పెట్టి మందులు కొనుగోలు చేశాడు. దీనిపై ఆస్పత్రి వైద్యుడు ఉప్రె వినయ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఆస్పత్రిలో మందుల కొరత లేదని, అన్ని రకాల మందులు ఉన్నాయని తెలపడం విశేషం.

గ్రంథాలయ నిర్మాణం ప్రారంభించాలి


స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలఅర్బన్: దండేపల్లి శాఖ గ్రంథాయ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన దండేపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల జిల్లా కేంద్ర గ్రంథాలయాలను సందర్శించారు. దండేపల్లి శాఖ గ్రంథాలయానికి రూ.30లక్షలు మంజూరు కావడంతో పంచాయతీ సమీపంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. లక్సెట్టిపేటలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యుత్, ఇతరత్రా బిల్లులు బకాయి లేకుండా చూడాలన్నారు. మంచిర్యాలలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో దండేపల్లి ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్ చంద్రకళ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రాజు, లక్సెట్టిపేట తహసీల్దార్ రాఘవేంద్రరావు, కమిషనర్ కల్లెడ రాజశేఖర్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణానికి రక్షణ కవచం హెల్మెట్

- డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్


ర్యాలీ ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ

మంచిర్యాలక్రైం: ప్రాణానికి హెల్మెట్ రక్షణ కవచం లాంటిందని డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ట్రాఫిక్ సీఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని అధ్యయనంలో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమని జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) ఎల్.కిష్టయ్య అన్నారు. మంగళవారం వేంపల్లి, పాతమంచిర్యాల వరకు నిర్వహించిన హెల్మెట్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ప్రమాదాలకు కారణమయ్యే అంశాలపై వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ రాహుల్‌కుమార్, ద్విచక్ర వాహనదారులు, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు


కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ల సతీమణులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో మంగళవారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. కార్యక్రమానికి డైరెక్టర్ల సతీమణులు శారద బలరాం, హరిణి సత్యనారాయణ, కళ్యాణి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన రంగురంగుల, వివిధ ఆకృతుల బొమ్మలు ఆకట్టుకున్నాయి. క్లబ్ ఆవరణలో అయోధ్య రామ మందిరం, సమ్మక్క సారలమ్మ వనదేవతలు, పర్ణశాల, బృందావనం సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సతీమణి రాధా సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: ఈ నెల 23న మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన పచ్చునూరి సురేష్‌పై పోల్‌రాజ్ అనే వ్యక్తి తలపై ఇటుకతో మోది పారిపోయాడు. సురేష్‌కు గాయాలు కావడంతో సమాచారం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతుని సోదరి స్వర్ణలత ఫిర్యాదు మేరకు పోల్‌రాజ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సాగర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కనర్‌గాం గ్రామానికి చెందిన నికోడె మోతీరాం (65) రెండేళ్లుగా పైల్స్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మృతుని కుమారుడు సుబ్బారావు పనినిమిత్తం వాంకిడికి వెళ్లగా భార్య తానుబాయి, కోడలు బూరబాయి పంట చేసుకు వెళ్లారు. సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆసిఫాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గతంలోనూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యూనియన్‌కు పలువురి రాజీనామా


రాజీనామా పత్రం చూపిస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్‌కు మంగళవారం పలువురు రాజీనామా చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణకు కార్యాలయం వద్ద రాజీనామా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు హరికృష్ణ మూడేళ్లుగా కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేశారన్నారు. రాజీనామా చేసిన వారిలో మాడుగుల నవీన్, చిప్పకుర్తి నర్సయ్య, దాసరి సుమన్, కోకిల శ్రీనివాస్, బరిగెల నగేశ్, కుటికల అశోక్, మోకన సత్తయ్య, మకిలి భూమేశ్, ఉప్పులేటి శ్రీనివాస్, కోకిల సది, ఎం.రఘుపతి, గోగర్ల రాంచందర్ ఉన్నారు.


5 నుంచి 11 వరకు సమావేశాలు



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియలోని ఇల్లందు క్లబ్‌లో మంగళవారం మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం మనోహర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చే నెల 5 నుంచి 11 వరకు ఏరియాలోని గనులు డిపార్టుమెంట్లపై ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనే ధ్యేయంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'మన గని–మన బాధ్యత'పై ఉద్యోగులకు వివరించి ఉత్పత్తి లక్ష్యాన్ని ఛేదించేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఏరియా అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ ధర్మరాజు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామంలో మంగళవారం పిచ్చికుక్క దాడి చేసి ముగ్గురిని గాయపర్చింది. నికోడె ధర్మరాజు చెంపపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. అదేవిధంగా పెటుకులె శంకర్, కోవ వార్లపై కూడా దాడి చేసి గాయపర్చింది. వీరిని వెంటనే కోసిని సర్పంచ్ శ్రీనివాస్ కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళపై పిచ్చికుక్క దాడి


తీవ్రంగా గాయపడిన శ్యామల

సిర్పూర్(టి): మండలంలోని వెంపల్లి గ్రామానికి చెందిన గౌత్రే శ్యామలపై మంగళవారం పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కలు దాడులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని డీఐఈవో శైలజ అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని 36 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించే ప్రాక్టికల్స్‌కు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఈసీ సభ్యులు శరత్‌కుమార్, ఎన్.పద్మ, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సకినాలు గొంతులో ఇరుక్కుని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: సకినాలు గొంతులో ఇరుక్కుని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం హమాలివాడకు చెందిన నరినేని రంగరావ్ (65) సోమవారం రాత్రి ఇంట్లో సకినాలు తింటుండగా గొంతులో ఇరుక్కున్నాయి. శ్వాస ఆడక ఇబ్బంది పడుతుండడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య అమ్మాయి, కుమారుడు అంజిత్‌రావ్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగుల పథకాలపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: కేంద్ర ప్రభుత్వ, జాతీయ మేధో వైకల్య దివ్యాంగుల సాధికారిత సంస్థ, మనోవికాస్ నగర సికింద్రాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల మెప్మాహల్‌లో అంగన్‌వాడీ, ఆశ, ఎస్ఎస్ఏ, ఐఈఆర్పీ ఉపాధ్యాయులకు ఎర్లీ ఇంటర్వేన్షన్ అండ్ రిహాబిలిటేషన్ సర్వీసెస్‌పై అవగాహన కల్పించారు. ఎన్ఐఈపీఐడీ సంస్థ కోఆర్డినేటర్ ఎస్.లకన్‌బాబు దివ్యాంగుల జననానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దివ్యాంగుల చట్టాలపై వివరించారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, సీడీపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ప్రజాభవన్‌లో వినతి


ప్రజాభవన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

పాతమంచిర్యాల: దళిత అభివృద్ధిశాఖ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో పనిచేసే కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్, కృష్ణ, రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలోని 8 పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో 48 మంది ఉద్యోగులు 2017 నుంచి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని, జీవో 60 ప్రకారం కాంట్రాక్టర్ కనీస వేతనాలు చెల్లించకపోవడంతో నష్టపోతున్నామన్నారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో ఎమ్మెల్యేకు భాగస్వామ్యం'

మందమర్రిరూరల్: కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి భాగస్వామ్యం ఉందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ వెంకటేష్ గుణ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేశారని, ఆ సమయంలో వివేక్ తెలంగాణ రాష్ట్ర సలహాదారుగా 2019 వరకు కొనసాగారన్నారు. జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కూడా భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు.

డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ డైరీ, ద్వైమాసిక పిలుపు పత్రికను మంగళవారం డీఆర్డీఏ పీడీ శేషాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల శంకర్, ఉపాధ్యక్షులు వి.లింగం, కార్యదర్శి జి.కనకయ్య, సాయి, జి.రమేశ్ యాదవ్, డి.రాజేశంగౌడ్, కే. జనార్దన్ గౌడ్, ఆర్. సంతోశ్ రెడ్డి, కె.శంకర్ పాల్గొన్నారు.

భూకబ్జాపై మంత్రికి ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని రెవెన్యూ, సింగరేణి లీజు భూముల ఆక్రమణలపై పట్టణానికి చెందిన కె.శ్రీనివాస్ మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. సచివాలయంలో మంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, పునరావృతం కాకుండా చూడాలని కోరారు.